క్లుప్తంగా

డాక్టర్ కూటికుప్పల సూర్యారావుకు దాసరి ఫిల్మ్ అవార్డు


వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ సూర్యారావు

కంచరపాలెం: వైద్య రంగంలో విశేష సేవలందించిన 'పద్మశ్రీ' డాక్టర్ కూటికుప్పల సూర్యా రావును దాసరి ఫిల్మ్ అవార్డు వరించింది. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ప్రతి ఏడాది నిర్వహించే దాసరి జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా దాసరి ఫిల్మ్ అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు.

సైనిక్ శిబిరానికి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులు ఎస్.కె.చాందిని, అమలాపురపు దినేష్, పిట్టా పవన్‌కుమార్ ఆల్ ఇండియా సైనిక్ క్యాంప్‌నకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి జూన్ 30 వరకు వివిధ స్థాయిల్లో ఈ క్యాంప్ జరగనుందని పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు పెద్దాపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ శిబిరంలో విజయం సాధించిన వారు తిరుపతి, సికింద్రాబాద్, ఢిల్లీ స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం ముగ్గురు విద్యార్థులను యూనిట్ కమాండర్ కల్నల్ అజయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరస అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని హై టెన్షన్ లైన్ల నిర్వహణలో భాగంగా చేపడుతున్న పలు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, విద్యుత్‌నగర్, కిరణ్ పార్క్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ


శిక్షణ పొందుతున్న మహిళలు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. శిక్షకురాలు సుగుణ మహిళలకు జ్యూట్ బ్యాగులు, పెన్సిల్ పౌచ్‌ల తయారీ, డిజైన్‌లను వివరించారు. మహిళలతో నమూనాలు తయారు చేయించారు. మొదటి విడతగా 16 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వీరు తయారు చేసిన బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మానవ సేవే మాధవ సేవ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, ఎస్.సీతారామకృష్ణ, సహాయ కార్యదర్శి పి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు, ఆలయ ఈవో పి.శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. ఎప్పుడిలా ఉంటా


43వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, కోలా గురువులు, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ తదితర నాయకులు

- మేలు జరిగితే మద్దతు తెలపండి
- 'ఉత్తర' ప్రజలతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి ఎన్నికల ప్రచారం
- బ్రహ్మరథం పట్టిన 43వ వార్డు వాసులు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గ ప్రజలకు ఆప్పుడిన్లై కొండంతా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా ఇచ్చారు. జీవీఎంసీ 43వ వార్డులో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, కె.కె.రాజు నిర్వహించిన ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు, పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. సంఘం ఆఫీస్ కూడలి వద్ద ప్రారంభమై శ్రీనివాసనగర్, నందగిరి నగర్, నరేంద్రనగర్, చెక్కుడురాయి బిల్డింగ్, జగన్నాథపురం ప్రాంతాల్లో కొనసాగిన ప్రచారంలో ప్రజలకు వారు అభివాదం చేస్తూ, కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా మీకు మేలు జరిగిందని భావిస్తే వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపమని తమ నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీగా అడుగుతున్నారన్నారు. ఉత్తర నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తల ఆశీస్సులతో ఘన విజయం సాధించి పరిపాలనా రాజధాని విశాఖకు ఘన స్వాగతం పలుకుతామన్నారు.

43వ వార్డులో రూ.6.5 కోట్లతో అభివృద్ధి

ఐదేళ్లుగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉత్తర నియోజకవర్గంలో సుమారు రూ.435 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని కె.కె.రాజు తెలిపారు. 43వ వార్డులో రూ.6.5 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, స్కూల్ అభివృద్ధి, బ్రిడ్జి కల్వర్టులు, శ్రీనివాసనగర్‌కు రోడ్ కనెక్టవిటీ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు.


ఎన్నికల ప్రచారంలో ఆత్మీయ పలకరింపు..

• విజయీభవ..


కె.కె.రాజుకు విజయం తిలకం దిద్దుతున్న మహిళ

దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి తనను ఆశీర్వదించి గెలిపించాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, పలు కార్పొరేషన్ల డైరక్టర్లు, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు, 43వ వార్డు నాయకులు, మహిళలు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ దీవెనలతోనే అఖండ విజయం : బొత్స ఝాన్సీ

ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తమను గెలిపించాలని కోరారు. ఎంపీ బ్యాలెట్‌లో తన పేరు మొదటి స్థానంలో, ఎమ్మెల్యే బ్యాలెట్‌లో కె.కె.రాజు పేరు మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ప్రజలంతా తమను దీవించి ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించాలని ఆమె అభ్యర్థించారు.


ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న బొత్స ఝాన్సీ, కె.కె.రాజు

కె.కె.రాజును గెలిపించుకుందాం


వర్తక సంఘం సభ్యులతో మాట్లాడుతున్న దేవరకొండ మార్కండేయులు

కంచరపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ఎన్నికల్లో గెలుపించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరకొండ మార్కండేయులు పిలుపునిచ్చారు. కంచరపాలెం కూడలిలోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో గురువారం కంచరపాలెం మార్కెట్ వర్తక సంక్షేమ సంఘం సభ్యులు, ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న కె.కె.రాజును అసెంబ్లీలో కూర్చోబెట్టాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరడ నూకరత్నం, సీరపు లత, ధనలక్ష్మి, రవి, యశోద, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

దాబాగార్డెన్స్: ఓటే వజ్రాయుధమని వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూపొందించిన ఓట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. దేశం, రాష్ట్రం బాగుపడాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌ఐ జాతీయ సెక్రటరీ జనరల్ పీఎల్‌కే మూర్తి, విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు ఎంకేవీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మనందరి ధ్యేయం.. వైఎస్సార్‌సీపీ విజయం


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ నాయకుడు బగాది విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం 49వ వార్డు కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నాయకుడు

కార్యక్రమంలో మాధవధారకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కంచరాన వరదరాజులు కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, సీనియర్ నాయకుడు జి.వి.రవిరాజు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, ఎం.సునీల్, రాజమోహన్, కంచరాన ప్రసాద్, దల్లి రామకృష్ణారెడ్డి, కన్నారావు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా నియంత్రణకు యాక్షన్ ప్లాన్

దాబాగార్డెన్స్: మలేరియా, డెంగ్యూ కేసులను నియంత్రించడానికి మైక్రో లెవెల్ కార్యాచరణను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని ఆరు జిల్లాల జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. రంగిరీజు వీధి యూపీహెచ్‌సీలో గురువారం జీవీఎంసీ జోన్-4 స్థాయిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జబ్బర్‌తోట, రంగిరీజు వీధి, ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా జ్వరాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, జీవీఎంసీ మలేరియా సిబ్బంది, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బంది, జిల్లా మలేరియా విభాగం, యూపీహెచ్‌సీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి లార్వా దశలోనే దోమల పెరుగుదలను నియంత్రించాలన్నారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి నీటి నిల్వలను పరిశీలించి దోమలు పెరుగుతున్నట్టయితే నిర్మూలించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ మాట్లాడుతూ యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫీవర్ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా కేసులు నమోదవుతున్న హాట్‌స్పాట్లను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు కావాలన్నారు.

ప్రచార పర్వం


49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్, ఎన్‌జీజీవోస్ కాలనీలో కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు, వార్డు నాయకులు - మద్రిపాలెం


కె.కె రాజును ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ 51వ వార్డు కళింగనగర్ పరిసర ప్రాంతాల్లో నివాసులకు వార్డు నాయకులతో కలిసి కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ - మద్రిపాలెం


55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలోని ఓ టిఫిన్ దుకాణంలో దోసెలు వేస్తూ వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించాలని ప్రచారం చేస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్. ఆయన వెంట పార్టీ 54, 55 వార్డుల ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్ తదితరులు - కంచరపాలెం


సింగరాయమెట్ట బాలయోగి గుడి వద్ద, పరిసర ప్రాంతాల్లో బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, నాయకులు - మద్రిపాలెం

ఆకర్షించేలా రెజ్యూమ్

ఏయూ క్యాంపస్: మార్కెట్‌లో ఉన్న ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా ఆకర్షించేలా రెజ్యూమ్‌ను తయారు చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ వగీర జొన్నాడ సూచించారు. గురువారం ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో రెజ్యూమ్ బిల్డింగ్.. పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వగీర మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగావకాశాలు సాధించే క్రమంలో ప్రాథమికంగా రెజ్యూమ్ నిర్మాణం గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. రెజ్యూమ్ అనేది ఒక విద్యార్థి సామర్థ్యాలు, నైపుణ్యం, అర్హతలను, భవిష్యత్తు ప్రణాళికలను తెలియపరిచే అద్భుతమైన డాక్యుమెంట్ అని పేర్కొన్నారు. విభాగం అధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బోరుగడ్డ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం.. అభివృద్ధి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయండి
- విశాఖ ఎంపీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు పిలుపు
- పార్టీ 'ఉత్తర' శ్రేణులతో ఆత్మీయ సమావేశం

మద్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. బిర్లా జంక్షన్ వద్ద బొత్స స్క్వేర్ హాల్‌లో కె.కె.రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పార్టీ ఉత్తర నియోజకవర్గ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో వారు దిశానిర్దేశం చేశారు. కె.కె.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. గతంలో ప్రజలు ఆశీర్వదించారని, ఇప్పుడు కూడా దీవించి గెలిపిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. జగన్ గెలుపే ప్రజల గెలుపని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి ఎప్పటిలాగే కొనసాగుతాయన్నారు.

నీచ రాజకీయాలు చంద్రబాబు నైజం

కె.కె.రాజు మాట్లాడుతూ వారసత్వ రాజకీయాలు కొనసాగించాలన్న ఆలోచనతో టీడీపీ అధినేత చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని, అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిస్వార్థంగా ఎలాంటి పక్షపాతం లేకుండా వైఎస్సార్ పార్టీ కుటుంబ సభ్యులు అన్ని విధాలా అండగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ క్యాడర్ ఎంతో అనుభవంతో కూడిందని, ఒక్కో బూత్ ప్రెసిడెంట్ తమ లక్ష్యాలను అధిగమించాలని కోరారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల అసత్యపు మాటలు, హామీలను గురించి ప్రజలకు తెలియజేసి వారిని చైతన్యపరచాలన్నారు. ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కణ ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి రమణమూర్తి, పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పేడాడ రమణికుమారి, పీలా ఉమారాణి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, సాడి పద్మారెడ్డి, శశికళ, ఉషశ్రీ, సారిపల్లి గోవింద్, రాష్ట్ర మైనారిటీ సెల్ విభాగం కార్యదర్శి షేక్ బాబ్జి, ఉత్తర బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగా మహేష్, స్టాండింగ్ కమిటీ మెంబర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

మద్రిపాలెం: మతిస్థిమితం లేని ఓ యువతి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. కంచరపాలెం కైలాసపురంలో అమ్మమ్మతో కలిసి నివసిస్తున్న వడ్డాది కీర్తి ఈ నెల 1న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఇంట్లో అమ్మమ్మతోపాటు అమ్మమ్మ చెల్లెలు ఉంటారు. సొంత అమ్మమ్మ లక్ష్మి ఆస్పత్రికి వెళ్లగా.. ఆమె చెల్లెలు లీలా ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో టీవీ చూస్తున్న యువతి బయటకు వెళ్లిపోయింది. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం అమ్మమ్మ లీలా ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువతి నాలుగడుగుల ఐదంగుళాల ఎత్తు, చామనఛాయ రంగు, ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు పసుపు రంగు బనియన్, నీలం ఫ్యాంట్ ధరించింది. కీర్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 90142 14742, 98487 64419 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ, ఏఎస్‌ఐ కోరారు.

చెస్ శిబిరానికి స్పందన


చదరంగం శిక్షణ శిబిరంలో విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాకర్స్ పార్కులో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణ శిబిరానికి బాలబాలికల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి రోజు సాయంత్రం గంటన్నర పాటు జరుగుతున్న ఈ శిక్షణ కు 90 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. శిక్షకుడు సనపల ఉమాపతి బాలబాలికలకు చెస్ క్రీడ లోని ఎత్తులకు పైఎత్తులు వేయడంలో మెలకువలను నేర్పిస్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో శిక్షణ జరుగుతోంది.

సంస్కృత భాష కంప్యూటరీకరణతో మేలు


మాట్లాడుతున్న ఆచార్య కోలవెన్ను మలయవాసిని

సీతంపేట: సంస్కృత భాష వ్యాప్తికి కంప్యూటరీకరణ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆచార్య కోలవెన్ను మలయవాసిని అన్నారు. జిల్లెళ్లమూడి సంస్కృతి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో 'సంస్కృత భాష-కంప్యూటరీకరణ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగించారు. అగర్తల ట్రిపుల్ ఐటీ పూర్వ డైరెక్టర్ పి.ఎస్.అవధాని మాట్లాడుతూ సంస్కృత భాష కంప్యూటరీకరణ పూర్వాపరాలను విపులంగా విశదీకరించారు. బి.గోపి మాట్లాడుతూ సంస్కృత భాష కోసం తాము రూపొందించిన కంప్యూటర్ గురించి విషయాలు సభికులకు వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, కె.వి.ఎస్.రాజేశ్వరరావు, జి.జానకీరామ్‌లు సంస్కృత బాష కంప్యూటరీకరణలోని పలు అంశాలపై చర్చించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ చిలకలూరి శాంతమ్మ, మల్లాది భాస్కరం, గాదిరాజు జానకీరామ్, ఘండికోట విశ్వనాథం పాల్గొన్నారు.

సత్యజిత్ రే చిత్రాలు ఆణిముత్యాలు


సత్యజిత్ రే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ తదితరులు

సీతంపేట: ఆస్కార్ అవార్డు గ్రహీత, భారతరత్న సత్యజిత్ రే సినిమా రంగంలో భారతదేశం గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరని ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సత్యజిత్ రే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గోపీకృష్ణ మాట్లాడుతూ సత్యజిత్ రే తీసిన చిత్రాలు ఎప్పటికీ ఆణిముత్యాలుగా కీర్తి పొందాయన్నారు. ఆయన బెంగాలీలో చిత్రాలు తీసినప్పటికీ భాషా భేదం లేకుండా అందరికీ అర్థమవుతాయని చెప్పారు. భారతీయ చలనచిత్ర రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి ఆస్కార్ అందుకున్న రే చిరస్మరణీయుడని కొనియాడారు. అనంతరం భారత ప్రభుత్వ ఫిల్మ్ డివిజన్ రూపొందించిన సత్యజిత్ రే డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, బర్మన్, ఎంవీవీ గుప్తా, చిన్నారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో శిక్షణ ప్రారంభం


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న మీనాక్షి

కంచరపాలెం: గొల్ల కంచరపాలెం సీతారామ మందిర ప్రాంగణంలో మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కూచిపూడి నృత్య శిక్షణ కార్యక్రమాన్ని శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నెల రోజుల పాటు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకురాలు డి.మీనాక్షి తెలిపారు. కూచిపూడి బేసిక్స్, ఐటమ్స్, థీమ్స్, ఫోక్ డ్యాన్స్, సినీ క్లాసికల్ అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జూన్ 2న జరిగే ముగింపు కార్యక్రమంలో కళాకారులకు సర్టిఫికెట్లు, మెడళ్లు అందిస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కొయ్య ఉమ జగదీష్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.